- సీఎం కేసీఆర్ దయతలచకుంటే
- తుమ్మల రాజకీయ జీవితం ఏనాడో ముగిసేది..
- అవసరానికి తగ్గట్లు పార్టీలు మారడం ఆయనకు అలవాటు
- ప్రజలకు మంచిచేసే ఆలోచన తుమ్మలకు ఎప్పుడూ లేదు..
- విలేకర్ల సమావేశంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

# తుమ్మల కంటే ఊసరవెల్లి నయం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు, పక్కన మంత్రి పువ్వాడ, ఎంపీ వద్దిరాజు

ఖమ్మం, అక్టోబర్ 28 (నమస్తేతెలంగాణ ప్రతినిధి): మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాజకీయాల్లో చూపించే రంగులు అన్నీ ఇన్నీ కావని, ఆయనకంటే ఊసరవెల్లే నయమని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మం నగరంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుమ్మలపై దయతలిచి సీఎం కేసీఆర్ మంత్రి పదవి ఇచ్చారని, లేకపోతే పదేళ్ల క్రితమే తుమ్మల రాజకీయ జీవితం ముగిసిపోయేదన్నారు. అలాంటి తుమ్మల నేడు కేసీఆర్‌పై అవాకులు చెవాకులు పేలుతుంటే బీఆర్‌ఎస్ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. తుమ్మల నాగేశ్వరరావు నాలుకకు నరం లేదని, ఆయన నోరు తెరిస్తే పచ్చి అబద్ధాలే బయటకు వస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే దగ్గరుండి ఆయన్ను ఇంట్లో కూర్చోబెడతారన్నారు. పాలేరు ఉప ఎన్నికలో సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి గెలిపిస్తే, ఇప్పుడు తుమ్మల పార్టీ తరపున పోటీ చేసే ఎవరూ లేక తనతో పోటీచేయించారని అనడం సిగ్గుచేటన్నారు. అవసరానికి తగినట్లు పార్టీలు మారడం తుమ్మలకే చెల్లిందన్నారు. పదవుల కోసమే తప్ప ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన తుమ్మలకు ఎప్పుడూ లేదన్నారు. పదవులు అవసరం లేదని అనేకసార్లు ప్రకటించిన తుమ్మల ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో ఎందుకు చేరారో చెప్పాలన్నారు. గోదావరి జలాలను ఖమ్మం తీసుకవస్తానంటున్న తుమ్మల గతంలో ఎన్టీఆర్, చంద్రబాబు హయాంలో మేజర్, మైనర్ ఇరిగేషన్ మంత్రిగా ఉండి ఎందుకు తీసుకరాలేదని ప్రశ్నించారు. ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్‌కు తుమ్మల చేసిన మేలు గుండు సున్నా అన్ని సీఎం కేసీఆరే పాలేరు సభలో ప్రకటించారని గుర్తుచేశారు. తుమ్మల, పొంగులేటి పార్టీ ద్రోహులన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తుమ్మల మిన్నకున్నారన్నారు. పైగా ఉద్యమకారులను జైల్లో పెట్టించారన్నారు. తన మంత్రి పదవి కోసం పాలేరు ఎమ్మెల్యే కందాళకు కేటీఆర్ డబ్బులు ఇచ్చారని తుమ్మల ఆరోపించడం, బాచుపల్లి మమత కాలేజీలో తనకు మంత్రి కేటీఆర్ భాగస్వాములనడం హాస్యాస్పదమన్నారు. నిజాయతీపరుడనని చెప్పుకునే తుమ్మలకు అశ్వారావుపేట ప్రాంతంలో అన్ని ఆయిల్‌పాం తోటలు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఎంతమంది రాజకీయ నాయకులను తొక్కి తుమ్మలపైకి వచ్చారన్నారు. డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం మాట్లాడుతూ.. గతంలో డీసీసీబీని లూటీ చేసిన వ్యక్తిని పొంగులేటి, తుమ్మల పక్కన తిప్పుకుంటున్నారని, తాను చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత డీసీసీబీని లాభాల బాటలోకి తెచ్చానన్నారు. బీసీనైనా తనకు డీసీసీబీ పదవి ఇస్తే ఎంతో మంది మంత్రి అజయ్‌ను ప్రశ్నించారన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఆర్జేసీ కృష్ణ పాల్గొన్నారు.

### ఒక్క కాంట్రాక్ట్ చేసినట్లు నిరూపిస్తే ఎన్నికల నుంచి తప్పకుంటా..



పాలేరు సభలో ముఖ్యమంత్రి కేసీఅర్ మాటలు అక్షర సత్యం. రాజకీయాల్లో ఉన్న వ్యక్తులు ప్రజలకు జవాబుదారీ తనంగా ఉండాలి. అబద్ధాలు చెప్తూ మోసం చేయాలని చూడడం సరికాదు. రాజకీయ నాయకులు ప్రజలకు ఆదర్శంగా ఉండాలి. నేను ఎమ్మెల్యే అయిన తర్వాత ఒక్క కాంట్రాక్ట్ తీసుకున్నట్లు నిరూపించినా నేను ఎన్నికల నుంచి తప్పుకుంటా. నాపై అసత్య ఆరోపణలు సరికాదు.

**– కందాళ ఉపేందర్‌రెడ్డి, పాలేరు ఎమ్మెల్యే**

### తుమ్మల వ్యాఖ్యలు బాధాకరం..



నా గురించి, సీఎం కేసీఆర్ గురించి మాజీ మంత్రి తుమ్మల అసత్య వ్యాఖ్యలు చేయడం బాధాకరం. తుమ్మల వైఖరిని నేను తీవ్రంగా ఖండిస్తున్నా. 25 ఏళ్ల రాజకీయ జీవితంలో నాపై ఒక్క అవినీతి మరక లేదు. నేను సంపాదించిన దానిలో కూడా కొంత ప్రజలకు ఇచ్చా. ప్రజాస్వామ్యంలో ఎవరు ఏ పార్టీలో నైనా ఉండొచ్చు.. కానీ కష్టకాలంలో అన్ని విధాలా ఆదరించి, అక్కున చేర్చుకుని అందలం ఎక్కించిన కేసీఆర్ గురించి తప్పుగా మాట్లాడకుండా ఉంటే తుమ్మల గౌరవం పెరిగేది. వాస్తవాలేమిటో తుమ్మల మనస్సాక్షికి తెలుసు. తెలంగాణ బిల్లుకు సంబంధించి ఓటింగ్ పెట్టినప్పుడు నేనే మొదటి ఓటు వేశాను. ప్రజల ఆశీర్వాదంతో నేను పార్లమెంట్‌లో అడుగు పెట్టాను. ప్రజలు గతంలో ఏ నాయకుడికి ఇవ్వని మెజార్టీ నాకు ఇచ్చారు. **– నామా నాగేశ్వరరావు, ఎంపీ**

### ఉమ్మడి జిల్లాలో 10 సీట్లు గెలుచుకుంటాం..



తెలంగాణ ఉద్యమంలో మాజీ మంత్రి తుమ్మల, మాజీ ఎంపీ పొంగులేటి పాత్ర ఏమీ లేదు. రాష్ట్రం వచ్చిన తర్వాత రాష్ట్ర నిర్మాణంలోనూ వారి పాత్ర లేదు. 2014 ఎన్నికల్లో ఓడిపోయి ఇంట్లో కూర్చున్న తుమ్మలకు మంత్రి పదవి ఇచ్చి సీఎం కేసీఆర్ సముచిత స్థానం ఇచ్చారు. నాడు బీఆర్‌ఎస్‌లో ఉంటూ తుమ్మల, పొంగులేటి ఒకరికొకరు పొడుచుకుంటూ బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఓటమిపాలు చేశారు. ఇప్పుడు వేరే పార్టీలో చేరి ఆ పార్టీని ఉద్ధరిస్తానంటే ప్రజలు ఎలా నమ్ముతారు? ఇప్పుడు వారి బాధ బీఆర్‌ఎస్‌కు లేదు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని పదికి పది స్థానాలు సాధించుకుంటాం. కేసీఆర్ ఎప్పుడూ తుమ్మలను తక్కువ చేసి చూడలేదు. పాలేరు సీటు కోసం తుమ్మల అనేకసార్లు ప్రయత్నించారు. ఇప్పుడు పాలేరు సీటు వదిలేసి ఖమ్మం వలస వచ్చారు. ఆయనకు నిజంగా ప్రజల్లో విశ్వసనీయత ఉందని అనుకుంటే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలవాలి. బీఆర్‌ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోను చూసి ప్రజలు మరోసారి కేసీఆర్‌కి అధికారం కట్టబెట్టడానికి సిద్ధంగా ఉన్నారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి, సుపరిపాలన, సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపించాయి. విజయంలో తుమ్మల పాత్ర ఎప్పుడూ లేదు. **– వద్దిరాజు రవిచంద్ర, రాజ్యసభ సభ్యుడు**

### బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఓడించింది తుమ్మల, పొంగులేటినే..!



తుమ్మల నాగేశ్వరరావు బీఆర్‌ఎస్‌లో కొనసాగుతూ పదవులు అనుభవించారు. ఇప్పుడు వేరే పార్టీలోకి వెళ్లి దెయ్యాలు వేదాలు వల్లించినట్లు కేసీఆర్‌పై వ్యాఖ్యలు చేస్తున్నారు. కేసీఆర్‌కు గతంలో మంత్రి పదవి ఇప్పించినట్లు నిస్సిగ్గుగా చెప్పుకోవడం తుమ్మలకే చెల్లింది. టీడీపీ ప్రభుత్వంలో తుమ్మలకు మంత్రి పదవి ఎలా వచ్చిందో జిల్లా ప్రజలకు తెలుసు. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను దగ్గరుంచి ఓడించింది తుమ్మల, పొంగులేటినే. ఎన్నికల్లో తనను ఓడించింది పొంగులేటినే అని తుమ్మల నాడు చెప్పుకొన్నారు. ఇప్పుడు వారిద్దరే చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతున్నారు. వారిని చూసి జనం నవ్వుకుంటున్నారు. డబ్బు రాజకీయాలకు వారు తెరతీశారు. కానీ ప్రజలు చైతన్యవంతులు. వారికి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తారు.

**– తాతా మధుసూదన్, బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ**

### గత ఎన్నికల్లో నన్ను ఓడించారు..



గత అసెంబ్లీ ఎన్నికలో నేను వైరా నియోజకవర్గం నుంచి పోటీ చేశాను. నేను పోటీ చేస్తున్న స్థానం నుంచి మాజీ ఎంపీ పొంగులేటి మరోవ్యక్తిని బరిలోకి దింపారు. నా పరాజయానికి కారకుడయ్యారు. మాజీ తుమ్మలను ఓడగట్టడంలోనూ పొంగులేటి పాత్రే ఉంది. అనూహ్యంగా ఇద్దరూ ఇప్పుడు ఒక పార్టీలో కలవడం విచిత్రం. ధనబలంతో వీర్రవీగుతున్న తుమ్మల, పొంగలేటికి భవిష్యత్తులో ప్రజలే గట్టిగా బుద్ధి చెబుతారు.

**– బానోతు మదన్‌లాల్, బీఆర్‌ఎస్ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి**

### తుమ్మల, పొంగులేటిదీ మోసపూరిత చరిత్ర..



మాజీ మంత్రి తుమ్మల, మాజీ ఎంపీ పొంగులేటిది మోసపూరిత చరిత్ర. బీఆర్‌ఎస్‌లో కొనసాగుతూ వారు పాల్పడిన చీకటి ఒప్పందాల వల్లే గత ఎన్నికల్లో నేను ఓడిపోయాను. పార్టీని వారు భ్రష్టు పట్టించారు.

**– లింగాల కమల్‌రాజు, బీఆర్‌ఎస్ మధిర ఎమ్మెల్యే అభ్యర్థి**

### తుమ్మల విశ్వాస ఘాతకుడు




కేసీఆర్‌కు మంత్రి పదవి ఇప్పించానని మాజీ మంత్రి తుమ్మల ప్రచారం చేయడం హాస్యాస్పదం. పార్టీలో తాను తప్ప మరెవరూ ఎదగకూడదనేది తుమ్మల మనస్తత్వం. టీడీపీలో కొనసాగినప్పుడు నన్నూ అలాగే అణద్రొక్కారు. తుమ్మలపై ప్రజలకు విశ్వాసం లేదు. ఇంకొకరితో స్నేహంగా మెలగడం తుమ్మలకు నచ్చదు. సీఎం కేసీఆర్ సీటు ఇచ్చారో.. లేదో.. తుమ్మల ఆత్మసాక్షిగా చెప్పాలి. తుమ్మల మాట్లాడే వాటిలో నూటికి 99 అబద్ధాలు ఉంటాయి. ప్రజలు, కార్యకర్తలను మోసం చేయడంలో తుమ్మల దిట్ట. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ అధిష్ఠానాలను మచ్చిక చేసుకునే విషయంలో ముందుంటారు. మొత్తానికి ఆయన విశ్వాస ఘాతకుడు.

**– కొండబాల కోటేశ్వరరావు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్**

# కాంగ్రెస్‌కు అసమ్మతి సెగ

- పార్టీ రెండో జాబితాలో ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురికి సీట్లు
- పాలేరు నుంచి పొంగులేటికి.. ఖమ్మం నుంచి తుమ్మలకు..
- పినపాక నుంచి పాయం వెంకటేశ్వర్లుకు అధిష్ఠానం కటాక్షం
- మూడు చోట్ల భగ్గుమన్న ఆశావహులు
- శాపనార్థాలు.. ఏడ్పులు.. పెడబొబ్బల్లో వారంతా బిజీ బిజీ
- బుజ్జగింపుల పర్వంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు
- ఒకవైపు బీఆర్‌ఎస్ ప్రచారంలో దూసుకుపోతుంటే సీట్ల గొడవలో 'హస్తం'



ఖమ్మం, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి అసమ్మతి సెగ తగులుతున్నది.. సీట్ల కేటాయింపు విషయంలో మొదలైన ముసలం ఇప్పుడు రగడలా మారింది.. 'నేను సీనియర్‌ని.. నేను పార్టీకి సేవకుడిని.. టికెట్ అడిగే హక్కు ఒక్క నాకు మాత్రమే ఉంది..' అంటూ ఒక్కో నాయకుడు ఒక్కో నిరసన గళం వినిపిస్తున్నారు. ఒకవైపు బీఆర్‌ఎస్ తరపున పోటీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతుంటే కాంగ్రెస్ పార్టీ మాత్రం ఇప్పటి వరకు సీట్ల సంగతి తేల్చలేకపోవడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు రెండు విడతలుగా శాసనసభ అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. అక్టోబర్ 15న మొదటి జాబితాను ప్రకటించగా ఆ జాబితాలో మధిర, భద్రాచలం సిట్టింగ్ శాసనసభ్యులైన మల్లు భట్టి విక్రమార్క, పొదెం వీరయ్యకు చోటు దక్కింది. ఇక శుక్రవారం రాత్రి విడుదలైన రెండో జాబితా కొందరు ఆశావహులను నిరాశ పరిచింది.

### పాలేరు సీటు కోసం పోరు..

కాంగ్రెస్ పార్టీ రెండోజాబితాలో పాలేరు సీటును పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కేటాయించడంపై కొందరు పెదవి విరుస్తున్నారు. పాలేరు సీటు రాలేదనే అసంతృప్తిలో పాలేరు మాజీ సర్పంచ్ రామసహాయం మాధవీరెడ్డి మనస్తాపానికి గురై ఆమె పార్టీ అధిష్ఠానంపై నిప్పులు చెరిగారు. తన అనచరులతో కలిసి మీడియా ముఖంగా గోడు వెళ్లబోసుకున్నారు. తనకు అన్యాయం జరిగిందని కన్నీటి పర్యంతమయ్యారు. అధిష్ఠానం తన నిర్ణయాన్ని మార్చుకోకపోతే కార్యకర్తలతో మరోసారి చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మరోవైపు ఇదే స్థానం నుంచి రాయల నాగేశ్వరరావు సీటు కావాలని దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఆయన వద్దకు పొంగులేటి వెళ్లి బుజ్జగించడంతో వెనక్కి తగ్గినట్లు తెలుస్తున్నది.

### ఖమ్మంలో బుజ్జగింపులు..

ఖమ్మం సీటును తుమ్మల నాగేశ్వరరావుకు కేటాయించడంతో ఇప్పటికే పార్టీ నుంచి టికెట్ ఆశిస్తున్న జావేద్, చోటే బాబా వంటి నాయకులు మనస్తాపం చెందినట్లు తెలుస్తున్నది. వారిని బుజ్జగించే పనిలో తుమ్మల ఉన్నట్లు సమాచారం. వీరేకాక మరికొందరు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు బోగట్టా.

### 'పినపాక'లో కాంగ్రెస్ నేతలు భగ్గు..

పినపాక సీటును పాయం వెంకటేశ్వర్లుకు కేటాయించడంతో టికెట్ కోసం దరఖాస్తు చేస్తున్న బట్టా విజయ్‌గాంధీ, చందా సంతోశ్, పోలెబోయిన శ్రీవాణి, కాటిబోయిన నాగేశ్వరరావు అసంతృప్తితో రగిలిపోతున్నారు. వీరిలో కొందరు ఈ మేరకు శనివారం మణుగూరులో విలేకర్ల సమావేశం కాంగ్రెస్ అధిష్ఠానంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బట్టా విజయ్‌గాంధీ తన అనుచరులతో తన స్వగ్రామమైన పోలవరంలో సమావేశమయ్యారు. ఇలా 'ఎవరికి వారు యమునా తీరు..' అన్నట్లు పార్టీ వర్గాలుగా విడిపోయింది. ఉమ్మడి జిల్లాలో 'హస్తం' ఛిద్రమవుతున్నది. ప్రస్తుతం టికెట్ పొందిన అభ్యర్థులు బుజ్జంగింపుల పనిలో ఉన్నారు. బుజ్జగింపులు పూర్తయి ఇక ప్రచారంలోకి వచ్చేదెన్నడో. మరో వైపు జరుగుతున్న పరిణామాలను చూసి సొంత పార్టీ నాయకులే తలలు పట్టుకోవడం గమనార్హం.

## రెండు రోజుల్లో భవిష్యత్ కార్యాచరణ

### పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్ ఆశావహులు



సమావేశంలో మాట్లాడుతున్న పినపాక నియోజకవర్గ ఆశావహులు

మణుగూరు టౌన్, అక్టోబర్ 28 : టికెట్ ఆశించిన తమ నిర్ణయం తీసుకోకుండా కాంగ్రెస్ అధిష్టానం పాయం వెంకటేశ్వర్లుకు టికెట్ కేటాయించడం పట్ల తాము అసంతృప్తిగా ఉన్నామని, రెండు రోజుల్లో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ టిక్ ఆశావహులు అన్నారు. రహస్యంగా సమావేశమైన వారు అనంతరం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ ఆశించి కొంత కాలంగా నియోజకవర్గంలో పార్టీని నిలబెట్టి, పలు కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లామని అన్నారు. పార్టీ కోసం పనిచేసిన తమను కొందరు పొంగులేటి, పాయం అనుచరులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, మా భవిష్యత్, మా పదవుల పట్ల మాకే భయాన్ని కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం పనిచేసిన తమకు కాకుండా కొత్తగా పార్టీలోకి వచ్చిన టికెట్ ఇచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నిర్ణయాన్ని లైన్‌ను ఏనాడూ దాటబోమని, కానీ తమ భవిష్యత్ కోసం భరోసా ఇవ్వని అధిష్టానం తీరు పట్ల అసంతృప్తిగా ఉన్నామన్నారు. మరో రెండు రోజుల్లో మా అనుచరులతో, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశమై భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్లు తెలిపారు. కొందరు నాయకులు మా అనుచరులపై బెదిరింపులకు పాల్పడుతున్న తీరును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో చందా సంతోశ్, బట్టా విజయ్‌గాంధీ, పోలెబోయిన శ్రీవాణి, కాటిబోయిన నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు నవీన్, ఇక్బాల్ హుస్సేన్, ఆయా ఆశావహుల ప్రధాన అనుచరులు ఉన్నారు.

## కష్టపడి పనిచేసిన వారికి మొండి'చేయి'

- పార్టీ నిర్ణయాలతో నిజమైన కాంగ్రెస్ నాయకులు బలి
- టికెట్ దక్కకపోవడంతో బట్టా విజయగాంధీ అసంతృప్తి
- కార్యకర్తలు, అనుచరులతో సమావేశం



కార్యకర్తలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఆశావహుడు బట్టా విజయగాంధీ

సారపాక, అక్టోబర్ 28 : ఎన్నో ఏళ్లుగా పార్టీని నమ్ముకుని పార్టీ అభివృద్ధి కోసం నిత్యం కృషిచేస్తున్న యువతకు కాంగ్రెస్ పార్టీ మొండిచేయి చూపుతున్నదని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ ఆశావహుడు బట్టా విజయ్ గాంధీ అన్నారు. శుక్రవారం ప్రకటించిన కాంగ్రెస్ రెండో విడత టికెట్ల జాబితాలో పాయం వెంకటేశ్వర్లుకు టికెట్ కేటాయించడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన శనివారం మండలంలోని పోలవరంలో నియోజకవర్గంలోని కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వాన్ని విస్తృతంగా చేపట్టి పార్టీ అభివృద్ధికి తాను కష్టపడ్డానని, ఇటీవల పార్టీలో చేరిన వారికి టికెట్లు కేటాయించడం ఏంటని ఆయన ప్రశ్నించారు. సమాజంలో డబ్బుకు ఉన్న విలువ పార్టీ నాయకులు, కార్యకర్తలకు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ప్రజలు, నాయకులు, కార్యకర్తల అభీష్టం మేరకు తన నిర్ణయం త్వరలోనే వెల్లడిస్తానన్నారు. సమావేశంలో సోంపల్లి సర్పంచ్ తాటి వీరాంజనేయులు, ఉప్పుసాక సర్పంచ్ వెంకటేశ్వర్లు, నకిరిపేట సర్పంచ్ సర్పా వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు పూలపెల్లి సుధాకర్‌రెడ్డి, ఇరవెండి మాజీ సర్పంచ్ శ్రీలక్ష్మి, సోంపల్లి ఉపసర్పంచ్ పెంకి సంతోశ్, గుండె వెంకన్న, నిమ్మల హరీశ్‌యాదవ్, ముర్రం రాంబాబు, హనీఫ్, భట్టా విజయ్‌గాంధీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాలేరు కాంగ్రెస్‌లో భగ్గుమన్న అసమ్మతి..

### టికెట్ రాకపోవడంతో కాంగ్రెస్ నేత మాధవీరెడ్డి ఆవేదన

### అనుచరులు, కార్యకర్తలతో పాలేరులో సమావేశం



ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరులో అనుచరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకురాలు మాధవీరెడ్డి

కూసుమంచి, అక్టోబర్ 28 : ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి భగ్గుమంటోంది. ఐదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తూ టికెట్ ఇస్తారని కష్టపడితే పార్టీ తనకు టికెట్ ఇవ్వలేదని పాలేరు మాజీ సర్పంచ్ రామసహాయం మాధవీరెడ్డి అసమ్మతి గళాన్ని వినిపించారు. పాలేరులోని ఓ ఫంక్షన్ హాల్లో శనివారం తన అనుచరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాధవీరెడ్డి మాట్లాడారు. తాను నాలుగు మండలాల్లో తిరిగి పార్టీని ముందుకు తీసుకొని పోయానని అయితే టికెట్ల పంపకాల విషయంలో అన్యాయం జరిగిందని ఆమె ఆరోపించారు. మహిళా కోటాలో అయినా టికెట్ ఇస్తారని ఆశించామని తెలిపారు. నాలుగు, ఐదు రోజుల్లో భవిష్యత్ ప్రణాళికను అనుచరులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ పార్టీలో రాష్ట్ర నాయకురాలిగా పనిచేశానని పార్టీ ఇచ్చిన ప్రతీ విషయాన్ని ప్రజల్లోకి తీసుకొని పోవడానికి తనవంతుగా పనిచేశానన్నారు. పాలేరులో పుట్టిన నాకు టికెట్ ఇవ్వకపోటానికి కారణాలు చెప్పాలన్నారు. రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబంలో ఉన్న నేను ఐదు సంవత్సరాలుగా నియోజకవర్గంలో పూర్తి బాధ్యతగా పని చేశానన్నారు.

# వైభవంగా శబరి స్మృతియాత్ర

- శోభాయమానంగా గిరి ప్రదక్షిణ
- ఫల, పుష్పాదులతో ఆరాధ్యదైవానికి పూజలు



శబరి చిత్రపటంతో గిరిప్రదక్షిణకు బయలుదేరుతున్న దేవస్థానం అధికారులు, గిరిజనులు



గిరిజనుల నృత్య ప్రదర్శన

భద్రాచలం, అక్టోబర్ 28 : భద్రాచలం సీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో 'శబరి స్మృతియాత్ర'ను శనివారం వైభవంగా నిర్వహించారు. ఆశ్వీయుజ పౌర్ణమిని పురస్కరించుకొని నిర్వహించే ఈ స్మృతియాత్రకు శుక్రవారం సాయంత్రమే ఆర్టీసీ బస్సుల్లో వివిధ ప్రాంతాల నుంచి ఆదివాసీ గిరిజనులను భద్రాచలం తీసుకొచ్చారు. శనివారం ఉదయం సంప్రదాయ వేషధారణలతో గిరిజనులు ఆలయానికి విచ్చేసి తమ ఆరాధ్యదైవాన్ని దర్శించుకొని మురిసిపోయారు. ఎంతో కష్టపడి అడవి నుంచి సేకరించి తీసుకొని వచ్చిన ఫల, పుష్పాదులను భక్తితో సీతారాములకు సమర్పించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ శబరిమాత చిత్రపటానికి పూలమాలలు వేసి ఆలయ ప్రదక్షిణ, గిరి ప్రదక్షిణ, నగర ప్రదక్షిణ నిర్వహించి ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా గిరిజనులు ప్రదర్శించిన కొమ్ము డాన్సులు పట్టణవాసులను ఎంతగానో అలరించాయి. అనంతరం బేడా మండపానికి స్వామివారి నిత్య కల్యాణ మూర్తులను తీసుకొచ్చి శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం నిర్వహించారు. అనంతరం గిరిజనులు తీసుకు వచ్చిన ఫల, పుష్పాదులతో స్వామివారికి పుష్పార్చన, ఫలార్చన జరిపారు. స్వామివారికి నివేదించిన ఫల, పుష్పాలను, లడ్డూ ప్రసాదాన్ని గిరిజనులకు అందజేశారు. ఏపీలో విలీనమైన కూనవరంలో గోదావరి– శబరి సంగమం వద్ద ఉన్న శబరి విగ్రహానికి భద్రాచలం అర్చకుడు మదనగోపాలాచార్యులను పంపించి ప్రత్యేక పూజలు జరిపించి, నూతన వస్త్రాలను ధరింపజేశారు. ఆశ్వీయుజ పౌర్ణమి నాడే వాల్మీకి జయంతి కావడంతో చిత్రకూట మండపం వద్ద ఉన్న వాల్మీకి మహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్ రమాదేవి, ఏఈఓలు శ్రావణ్‌కుమార్, భవాని రామకృష్ణ, ఆస్థాన స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ఆలయ ప్రధానార్చకులు పొడిచేటి సీతారామానుచార్యులు, అమరవాది విజయరాఘవన్, ఇతర అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.